సాక్షి నారాయణపేట

సోమవారం, 10, జూన్, 2024



భయం గుప్పిట్లో..

గండీడ్ మండలంలో చిరుతల సంచారం కలకలం రేపుతోంది.

వివరాలు 2లో ▸



బదిలీలకు వేళాయె..

ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో అధికారుల బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

వివరాలు 4లో ▸

గరిష్టం/కనిష్టం 31.5 /24.5

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నారాయణపేట: జిల్లాలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నందకిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరికల్, ధన్వాడ, నారాయణపేట రూరల్, ఊట్కూర్ మండలాల్లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 7నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. విని యోగదారులు సహకరించాలని కోరారు.

వెలువడని జీహెచ్‌ఎంల సీనియార్టీ జాబితా

- నేడు లాంగ్వేజ్ పండిట్‌లు, పీఈటీల సర్టిఫికెట్ వెరిఫికేషన్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి రెండు రోజుల క్రితమే షెడ్యూల్ ప్రకటించినా సీనియార్టీ వెలువడలేదు. షెడ్యూల్ ప్రకారం ఆదివారమే ఆర్జేడీ కార్యాలయం నుంచి పదోన్నతులకు సంబంధించి అర్హులైన జీహెచ్‌ఎంల సీనియార్టీ జాబితా వెలువడాల్సి ఉంది. కానీ, రాత్రి వరకు కూడా షెడ్యూల్ విడుదల కాలేదు. దీంతో ఎప్పుడు లిస్టు వస్తుందా అని ఉమ్మడి జిల్లాలో సుమారు 1,800 మంది ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. గత సెప్టెంబర్‌లో జోన్–2 పరిధిలో బదిలీలు పూర్తి కాగా.. కేవలం పదోన్నతుల ప్రక్రియ మిగిలి ఉంది. ఈ క్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారులు లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీల సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి డీఈఓ రవీందర్ ప్రకటన సైతం విడుదల చేశారు. మూడు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసినవారు వెరిఫికేషన్‌కు హాజరుకావాలని సూచించారు. పూర్తి అప్‌డేట్ ఉన్న సర్వీస్ బుక్, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్సులు, గెజిటెడ్ హెచ్‌ఎం సంతకంతో తీసుకురావాలన్నారు. ఉదయం 10.30 గంటలకు జిల్లాకేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో వెరిఫికేషన్ ఉంటుందన్నారు.

ఆయిల్‌పాం సాగుకు దరఖాస్తులు

పెద్దకొత్తపల్లి: ఆయిల్‌పాంపై మక్కువతో 2024 సంవత్సరం జూన్ నుంచి 2025 మార్చి వరకు సాగు చేయాలనుకునే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని తెలంగాణ ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ కొల్లాపూర్ డివిజన్ అధికారి లక్ష్మణ్ నాయక్ తెలియజేశారు. సాగు చేపట్టే రైతులు భూమి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ మూడు జతల సెట్లను, జిరాక్స్‌లను ఉద్యాన శాఖ కార్యాలయం కొల్లాపూర్‌లో అందజేయాలన్నారు. మొక్కలను సీనియార్టి ప్రకారం అందజేస్తామని వివరించారు.

పెట్టుబడి భారం..

ఏటా పెరుగుతున్న పంటసాగు ఖర్చులు

- విత్తనాలు, ఎరువుల ధరలు పైపైకి..
- రూ. 95 అధికమైన పత్తి ప్యాకెట్ రేటు
- ఆందోళనలో అన్నదాతలు



లింగంపల్లి శివారులో పత్తి విత్తనాలు విత్తుతున్న వ్యవసాయ కూలీలు

మక్తల్/మరికల్: అన్నదాతకు వ్యవసాయం భారంగా మారుతోంది. ఏటా పెరుగుతున్న ధరలతో పెట్టుబడులు తడిసి మోపెడవుతున్నాయి. ఓవైపు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం.. మరోవైపు విత్తనాలు, ఎరువుల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గతేడాది కేజీ పత్తి ప్యాకెట్ ధర రూ. 745 ఉండగా.. ఈ ఏడాది రూ. 95 అధికమైంది. దాదాపుగా అన్నిరకాల విత్తనాల ధరలను కంపెనీలు పెంచడంతో రైతులపై అధిక భారం పడుతోంది. పెరిగిన ట్రాక్టర్ల కిరాయి, కూలీల రేట్లతో సతమతమవుతున్న రైతులను విత్తనాలు, ఎరువుల ధరలు ఆందోళనకు గురి చేస్తున్నాయి.

- జిల్లాలో 2.5 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతోంది. ఎకరాకు 3 ప్యాకెట్ల చొప్పున విత్తనాలు విత్తాలి. ఒక ప్యాకెట్‌కు రూ. 95 ధర పెంచడంతో ఎకరా పత్తి సాగుకు రూ. 285 అదనంగా భారం పడుతోంది. ఇప్పటికే అనేక రకాల పత్తి విత్తనాల కంపెనీలు వివిధ పేర్లతో డీలర్లకు సరఫరా చేయగా.. రైతులకు విక్రయిస్తున్నారు. వీటికి తోడు కొందరు డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయించి, రైతులను నట్టేట ముంచుతున్నారు. ప్రతి ప్యాకెట్‌పై క్యూఆర్ కోడ్ నిబంధనను ప్రభుత్వం అమలు చేస్తున్నా.. రైతులు నకిలీ విత్తనాలతో మోసపోతూనే ఉన్నారు.

తప్పని అవస్థలు..

మిరప, వరి, కంది, ఆముదం తదితర విత్తనాల ధరలు పెరుగుతుండటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ పరంగా మిరప విత్తనోత్పత్తి లేకపోవడంతో ప్రైవేటు కంపెనీలు విక్రయించే విత్తనాలే రైతులకు దిక్కవుతున్నాయి. 10 గ్రాముల విత్తనాలకు రూ. 1,300 ధర పలుకుతోంది. సాగును దృష్టిలో ఉంచుకుని వివిధ రాష్ట్రాలకు చెందిన విత్తన కంపెనీలు కొత్త కొత్త బ్రాండ్ల పేరుతో విక్రయిస్తున్నాయి. జిల్లా రైతులు ఎక్కువగా విత్తనాల కోసం కర్నూలు డీలర్లను ఆశ్రయిస్తుంటారు.

ప్రభుత్వ రాయితీ కనుమరుగు..

రాష్ట్ర ప్రభుత్వం గతంలో కూరగాయలు, మిరప ఇతర వాణిజ్య పంటల విత్తనాలను హాకా ద్వారా రైతులకు రాయితీపై అందించేది. నాలుగేళ్ల కిందట ప్రభుత్వం రాయితీలకు స్వస్తి పలికింది. దీంతో రైతులు మొత్తం ధర వెచ్చించి మిరప విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎకరా మిరప సాగుకు దాదాపుగా రూ.13 వేలు విత్తనాలకే ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటులో కొనుగోలు..

సాధారణ పత్తి సాగుకు అవసరమైన విత్తనాల సరఫరాను ప్రభుత్వం నిలిపివేసింది. రైతులంతా ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేస్తున్నారు. పలు కంపెనీలు వివిధ రకాల విత్తనాలను మార్కెట్‌లోకి తీసుకురావడంతో విత్తన ధరలపై కేంద్ర ప్రభుత్వం నియంత్రణ విధించింది. ఏటా విత్తన తయారీ తదితర ఖర్చులను లెక్కించి, ప్రభుత్వం కంపెనీలకు విక్రయ ధర నిర్ణయిస్తోంది. ఆ మేరకు విత్తనాలు విక్రయించాల్సి ఉంటుంది. మార్కెట్‌లో బీటీ–1, బీటీ–2 రకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు బీటీ–2 సాగుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల పత్తి ప్యాకెట్లు

కిలో విత్తనాల ప్యాకెట్ ధరలు (రూ.లలో) ఇలా..

విత్తనం	గతేడాది	ప్రస్తుతం
పత్తి	745	850
ఆముదం	450	550
కంది	250	300
వరి 20 కేజీల బస్తా (ఆర్‌ఎన్‌ఆర్)	950	1,050

ధరలపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలి..



మిరపతో పాటు వాణిజ్య పంటల విత్తనాల ధరలపై ప్రభుత్వ నియంత్రణ ఉంటే బాగుంటుంది. తక్కువ ధరకు దొరుకుతాయని లూజ్‌గా తీసుకుని సాగుచేస్తే, సరైన దిగుబడి రాక నష్టపోతున్నాం. రెండు ఎకరాల సాగుకు అవసరమైన విత్తనాల కోసమే రూ. 30 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. మిరప విత్తనాల ధరలను పెంచితే పంట సాగు చేయడం కష్టంగా మారుతుంది.

– శ్రీనివాస్, రైతు, ఇబ్రహీంపట్నం

విత్తనాల ధర తగ్గించాలి..



ఎకరాకు మూడు ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరం కాగా.. పెరిగిన ధరలతో విత్తనాలకే రూ. 2,550 ఖర్చు అవుతుంది. ఇలా వ్యవసాయానికి సంబంధించిన ప్రతి వస్తువు ధర పెరిగితే రైతులకు నష్టాలు తప్ప, లాభాలు ఉండవు. పెరిగిన పత్తి విత్తనాల ధరలను తగ్గించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.

– అంజినేయులు, రైతు, మరికల్

పెట్టుబడులు పెట్టలేకపోతున్నాం..



రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదు. సాగు పెట్టుబడులు మాత్రం విపరీతంగా పెరగంతో వ్యవసాయం చేయలేకపోతున్నాం. కూలీలు, ఎరువులు, విత్తనాల ధరలు అమాంతం పెరగడంతో ఎకరాకు రూ. 40 వేల వరకు పెట్టుబడి అవుతుంది.

– రాజు, రైతు, గుడిగండ్ల

గిట్టుబాటు కావడం లేదు..



మార్కెట్‌లో లభించే ప్రతి వస్తువు ధరను ఉత్పత్తిదారుడే నిర్ణయిస్తాడు. కానీ రైతులు పండించిన పంటలకు మాత్రం ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటిస్తున్నాయి. సాగు పెట్టుబడులు పెరగడంతో మద్దతు ధరలు గిట్టుబాటు కావడం లేదు.

– సవారప్ప, రైతు, మాద్వార్

రేపు లక్కీడిప్

గద్వాల అర్బన్: 2024–25 విద్యాసంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో విద్యార్థుల ప్రవేశాల కోసం ఈ నెల 11న లక్కీడిప్ నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి శ్వేతా ప్రియదర్శిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి నాన్–రెసిడెన్సియల్, 5వ తరగతి రెసిడెన్సియల్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉదయం 10:30 గంటలకు జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాయలంలో కలెక్టర్ బీఎం సంతోష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 1వ తరగతికి 57సీట్లు, 5వ తరగతికి 59సీట్లు అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరు లక్కీడిప్‌కు తప్పసరిగా సరిగా హాజరుకావాలని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కృష్ణా: పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. స్థానిక బసవేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం మాగనూర్, ఉమ్మడి కృష్ణా మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమై పార్లమెంట్ ఎన్నికల్లో పోలైన ఓట్లపై బూత్‌ల వారీగా సమీక్షించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో సిద్దార్థారెడ్డి, గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజప్పగౌడ, ఆనంద్‌గౌడ్ ఉన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష



జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో అభ్యర్థుల హాల్‌టికెట్ చెక్ చేసి లోపలికి పంపిస్తున్న సిబ్బంది

- జిల్లావ్యాప్తంగా 3,023 మంది గైర్హాజరు
- చివరి నిమిషంలో పరుగులు తీసిన పలువురు అభ్యర్థులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో ఆదివారం జరిగిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష కొనసాగింది. జిల్లాలో మొత్తం 36 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయగా.. 15,199 మంది అభ్యర్థులకు గాను 12,176 మంది హాజరు కాగా.. 3023 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులు వెళ్లే ముందు క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు. అలాగే మహిళా అభ్యర్థులను ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పరిశీలించారు. అభ్యర్థులను ఉదయం 9.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాలకు బయోమెట్రిక్ తీసుకుని అనుమతిచ్చారు. ఉదయం 9 గంటల నుంచే పరీక్ష కేంద్రాలకు వచ్చిన అభ్యర్థులు.. బయోమెట్రిక్ కోసం బారులుదీశారు. 10.30 గంటల తర్వాత వచ్చిన అభ్యర్థులను అనుమతించలేదు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని కేంద్రాల వద్ద ప్రాథమిక చికిత్స నిమిత్తం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని జేపీఎన్‌సీ కళాశాల కేంద్రం వద్ద ఆలస్యంగా వచ్చిన కొంతమంది అభ్యర్థులు నిరాశగా వెనుదిరిగారు.



బాలికల జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

పరిశీలించిన కలెక్టర్

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రవినాయక్ సందర్శించారు. జిల్లాకేంద్రంలోని రెయిన్‌బో స్కూల్, ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాల, ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలకు వెళ్లి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అభ్యర్థుల కోసం ఎలాంటి సౌకర్యాలు కల్పించారని ఆరాతీశారు. పరీక్ష నిర్వహణలో అవకతవకలకు తావు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతోపాటు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

మైసమ్మ చెంత.. జన జాతర



నవాబుపేట: ఫతేపూర్ మైసమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శనివారం మృగశిర కార్తె రావడంతో మైసమ్మ చెంతకు వేలాది మంది చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కొందరు తమ వాహనాలకు పూజలు జరిపించారు. వేలాది మంది తరలిరావడంతో మైసమ్మ అడవి మొత్తం జనసందోహం కనిపించింది.

15 ఏళ్లు పైబడితే తుక్కే..

కాలం చెల్లిన అన్నిరకాల వాహనాలపై దృష్టి

- 15 ఏళ్లు దాటినవి తొలగించాలనే యోచనలో కేంద్ర ప్రభుత్వం
- వాటి పొగతో వచ్చే కాలుష్యం వల్లే అనేక రుగ్మతలు
- ఇప్పటికే ఫిట్‌నెస్ పరీక్ష ఫీజులు భారీగా పెంపు
- ఉమ్మడి జిల్లాలో 15 ఏళ్లు పైబడి 73,084 వాహనాలు

జిల్లాల వారీగా.. 15 ఏళ్లు దాటిన అన్ని వాహనాలు

మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	వనపర్తి
42,378	10,776	7,346
గద్వాల	**నారాయణపేట**	**మొత్తం వాహనాలు**
5,508	7,076	73,084



మహబూబ్‌నగర్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

పాలమూరు: దేశవ్యాప్తంగా 15 ఏళ్లు పైబడిన అన్నిరకాల వాహనాలను తొలగించాలని (స్క్రాప్) కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో మొదట 15 ఏళ్లు పైబడిన ప్రభుత్వ వాహనాలపై దృష్టిసారించనుంది. ఇప్పటికే 15 ఏళ్లు పైబడిన అన్ని రకాల వాహనాలకు గ్రీన్ ట్యాక్స్, ఫీజులు, ఫిట్‌నెస్ ఇలా అన్ని రకాల సర్వీస్ ఫీజులు రెట్టింపు చేయడం జరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో బీఎస్–6 వాహనాలను తయారు చేస్తున్న క్రమంలో పాత వాటిని స్క్రాప్ చేయాలని భావిస్తున్నారు. సెంట్రల్ మోటార్ వాహన నిబంధనల ప్రకారం అన్ని రకాల ప్రైవేట్ వాహనాలు 15 ఏళ్లు పైబడి ఉంటే సంబంధిత మోటార్ వాహన అధికారి దగ్గర పరీక్షించుకోవాల్సి ఉంటుంది. సదరు రవాణ శాఖాధికారి ఆ వాహనం రోడ్డుపై తిరగడానికి యోగ్యమైందని భావిస్తే ఐదేళ్లు గడువు పెంచుతారు. కానీ, ప్రస్తుతం వాటి ఫీజులు భారీగా పెంచడం వల్ల 15 ఏళ్లు పైబడిన ఏ వాహనం కూడా ఆర్టీఏ కార్యాలయాలకు రావడం లేదు. దీంతో ఫిట్‌నెస్ పరీక్షలు కొనసాగడం లేదు.

మహబూబ్‌నగర్‌లోనే అధికం..

15 ఏళ్లు పైబడిన అన్ని రకాల వాహనాలు మహబూబ్‌నగర్ జిల్లాలోనే అత్యధికంగా 42,378 ఉండటం విశేషం. అత్యల్పంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో 5,508 ఉన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పరిశీలిస్తే 15 ఏళ్లు దాటిన వాహనాల్లో ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు, పలు రకాల కార్లు అధికంగా ఉన్నాయి. వీటిలో చాలా వాహనాల్లో సరైన ఫిట్‌నెస్ లేక విపరీతమైన పొగ వదులుతున్నా వాహనదారులు అలాగే రోడ్లపై నడుపుతున్నారు. ఇలాంటి వాహనాలతో కాలుష్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఉమ్మడి జిల్లాలో సామర్థ్యం తగ్గిపోయిన వాహనాలు వదులుతున్న పొగ కారణంగా విపరీతమైన కాలుష్యం ఏర్పడుతోంది. ఫలితంగా జిల్లావాసులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. పొగతో వెలువడే కారకాల వల్ల చాలా మందిలో శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి.

ఆదేశాలు రాలేదు..



15 ఏళ్ల కాలపరిమితి దాటిన వాహనాలపై చర్యలు తీసుకోవాలనే అంశంపై ఉన్నతాధికారుల నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. అయితే.. అన్ని రకాల వాహనాలను స్క్రాప్ చేయాలనే దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరలో ఒక స్పష్టమైన ఆర్డర్స్ వచ్చే అవకాశం ఉంది. మొదట ప్రభుత్వ వాహనాలపై దృష్టిపెట్టడం ఆ తర్వాత ప్రైవేట్ వాహనాలపై ఉంటుంది. ప్రస్తుతం 15 ఏళ్లు దాటిన వాహనాలు వస్తే అన్ని రకాల ఫిట్‌నెస్ పరీక్షలు చేసి అవసరమైన వాటికి మరో ఐదేళ్లు ఇస్తున్నాం. 15 ఏళ్లు దాటిన వాహనాలతో కాలుష్యం ఏర్పడి చర్మ, శ్వాసకోశ ఇతర ఆరోగ్య సమస్యలు వస్తాయి.

– రఘుకుమార్, జిల్లా రవాణా శాఖాధికారి, మహబూబ్‌నగర్

ఏ వాహనాలు ఎన్ని అంటే..

వాహనాలు	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	వనపర్తి	గద్వాల	నారాయణపేట
బైక్‌లు	11,045	3,756	2,859	1,752	2,416
ట్రాక్టర్లు	10,548	2,705	2,705	1,515	2,336
కార్లు	9,862	2,083	178	919	1,335
ఆటోలు	4,350	791	340	170	366
గూడ్స్	4,246	1,066	981	981	459
సీసీ బస్సులు	1,006	17	8	0	0
మోటార్ క్యాబ్	679	162	168	101	94
స్టేజీక్యారేజ్ బస్సు	301	27	27	4	8
మ్యాక్సీక్యాబ్	238	60	20	9	31
స్కూల్ బస్సులు	93	106	57	57	31
ప్రైవేట్ సర్వీస్‌లు	10	3	3	0	0



మహబూబ్‌నగర్‌లో పరీక్ష కేంద్రానికి పరుగెత్తుకొని వస్తున్న మహిళా అభ్యర్థులు

చివరి నిమిషంలో.. పరుగో.. పరుగు

జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షకు పలువురు అభ్యర్థులు ఆలస్యంగా వచ్చి.. ఉరుకులు, పరుగులు పెట్టారు. పరీక్ష ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కాగా.. అధికారులు 9 నుంచి 10 గంటలకు వరకే లోపలికి అనుమతించారు. ఆ తర్వాత వచ్చిన వారిని గేటు బయటే ఆపేసి వెనక్కి పంపించడంతో పలువురు కన్నీళ్లు పెట్టుకొని నిరాశగా వెనుదిరిగారు. అలాగే కొందరు దివ్యాంగులు సహాయకులతో వచ్చి పరీక్ష రాశారు.

– సాక్షి నెట్‌వర్క్‌



స్విట్స్‌ కళాశాల వద్ద అనుమతించకపోవడంతో అధికారులను వేడుకుంటున్న అభ్యర్థులు



పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్న ఓ అభ్యర్థి





మహబూబ్‌నగర్‌లో సహాయకులతో కలిసి పరీక్ష రాసేందుకు వస్తున్న దివ్యాంగులు



పరుగున వస్తున్న ఓ అభ్యర్థి

క్లుప్తంగా

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

జడ్చర్ల: పిల్లలకు మంచి మార్కులు రాకపోవడంతో భార్యను భర్త మందలించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన భార్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానిక రంగారావుతోటలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. ఉత్తర్‌ప్రదేశ్‌ రాష్ట్రం జాన్‌పూర్‌ జిల్లా మెజ్రా గ్రామానికి చెందిన రామ్‌ అశీష్‌ యాదవ్‌ మండల పరిదిలోని పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇతను స్థానిక రంగారావుతోటలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల తమ సొంత ఊరు నుంచి జడ్చర్లకు వచ్చిన భార్యను పిల్లలకు మార్కులు తక్కువగా రావడంతో భర్త మందలించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భార్య ప్రీతియాదవ్‌(34) భర్త ఉద్యోగానికి వెళ్లగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు, బైక్‌ ఢీ : వ్యక్తి దుర్మరణం



మంగ్యానాయక్‌ (ఫైల్‌)

వెల్దండ: మండల కేంద్రంలో కారు, బైక్‌ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ రవికుమార్‌ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని ఎంజీ తండాకు చెందిన రాత్లావత్‌ మంగ్యానాయక్‌ (38) బైక్‌పై హైదరాబాద్‌ నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో కల్వకుర్తి నుంచి హైదరాబాద్‌ వెళ్తున్న కారు మండల కేంద్రం సమీపంలో ఎదురుగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మంగ్యానాయక్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



గాయపడిన మహిళ

మాగనూర్‌: మండల పరిధిలోని నల్లగట్టు మారెమ్మవ్వ దేవాలయం వద్ద ఆదివారం జరిగిన రెండు వెర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురుకి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం తెల్లవారుజామున కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌ జిల్లా మామిడిపల్లికి చెందిన తల్లి, కుమారుడు సొంత పనుల నిమిత్తం శుక్రవారం మక్తల్‌కు వచ్చి శనివారం తెల్లవారుజామున తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో వర్షం కారణంగా ద్విచక్రవాహనం అదుపు తప్పి.. కింద పడిపోవడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఓ ప్రైవేట్‌ వాహనంలో చికిత్స నిమిత్తం రాయచూర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు.

ఏఎస్‌ఐ వాహనం..



చేయి విరిగిన లారీ డ్రైవర్‌

మరో సంఘటనలో నల్లగట్టు మారెమ్మవ్వ సమీపంలో కర్ణాటక వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్‌ టీ కోసం లారీ నుంచి దిగి వస్తున్నాడు. మక్తల్‌ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్‌ఐ ఖాజామైనొద్దీన్‌ కృష్ణ మండలం చెక్‌పోస్టు వద్ద విధులు ముగించుకుని ద్విచక్రవాహంపై వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతున్న లారీ డ్రైవర్‌ను ఏఎస్‌ఐ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌ కుడి చేయి విరిగిపోయినట్లు స్థానికులు తెలిపారు. స్థానిక పోలీసులు లారీ డ్రైవర్‌ను మాగనూర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

భయం గుప్పిట్లో గ్రామాలు



కొండాపూర్‌ సమీపంలో చిరుత తిరుగుతున్న ప్రాంతం ఇదే

- వారం రోజులుగా సంచరిస్తున్న చిరుత
- కంటి మీద కునుకు లేకుండా జీవనం

గండీడ్‌: చిరుత సంచారం కలకలం రేపుతుంది. లేగదూడ, మేకలపై దాడి చేయడమే కాక రోజు ఎవరికో ఒకరికి కంట పడుతూనే ఉంది. అయినా అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడంతో గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా జీవిస్తున్నారు. వివరాల్లోకి వెళితే గురువారం కొండాపూర్‌ చెందిన వెన్నాచేడ్‌ శ్రీనివాస్‌ గొర్లెల్ల గుట్ట సమీపంలో తన పశువులను పొలం వద్ద కట్టేసి వచ్చాడు. ఉదయం వెళ్లి సరికి అక్కడ లేగదూడ లేదు. పక్కవారి సాయంతో చుట్టు పక్కల వెతికారు. సమీప గుట్టల్లో లేగదూడ చనిపోయింది. శరీరం సగం భాగం తిని ఉంది. కొద్ది దూరంలో చిరుత పడుకుని ఉండడంతో భయంతో వెనుతిరిగి వచ్చారు. సాయంత్రం వర్షం పడ్డ తర్వాత గుట్టపై తిరుగాడుతుండగా రైతులు గమనించారు. ఆశిరెడ్డిపల్లి వైపు గుట్టల్లోకి వెళ్లింది. అదేరోజు రాత్రి 8గంటల ప్రాంతంలో లింగాయిపల్లి–రంగారెడ్డిపల్లి మధ్య చిరుత రోడ్డు దాటడం గమనించిన ఓ లారీ డ్రైవర్‌ స్థానికులను అప్రమత్తం చేశారు. మరుసటి రోజు ఉదయం ఆశిరెడ్డిపల్లి చెందిన రైతులు ఉదయం పొలాలకు వెళ్లిన రైతుల కంట పడింది. వారు భయంతో ఇంటికి వెళ్లారు. అదే రెడ్డిపల్లికి చెందిన చాపల తిరుపతయ్య మేకగుట్ట వద్ద చాపలగుంత సమీపంలో చనిపోయి ఉంది. దీన్ని సగం తిని వదిలేసింది. మంగళవారం పట్టపగలు ఉదయం 11గంటల ప్రాంతంలో ఆశిరెడ్డిపల్లికి చెందిన చెవుల వెంకటయ్య పొలానికి వెళ్లగా గుట్టపై చిరుత కనిపించింది. దీంతో ఆయన సమీప రైతులకు సమాచారం ఇచ్చాడు. మేకల కాపరులకు సైతం సమాచారం ఇచ్చి అటుగా వెళ్లకుండా అప్రమత్తం చేశారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో చిరుత మారోమారు ప్రత్యక్షమైంది. కొండాపూర్‌ చెందిన రెడ్డిపల్లి అంజిలయ్య పశువుల పాక వద్ద చిరుత కుక్కను తరుముకు వచ్చింది. బ్యాటరీ లైట్‌ వేసి చూడగా చిరుత కనిపించడంతో అంజిలయ్య పక్క పొలం వారి వద్దకు పరుగెత్తాడు. ఇలా రోజు ఏదో ఒక ఘటన మండలంలో జరుతున్నా పట్టించుకోవడం లేదు.



చిరుత దాడిలో మృతి చెందిన లేగదూడ

పట్టించుకోని అధికారులు..

వారం రోజులుగా ఆశిరెడ్డిపల్లి, కొండాపూర్‌, రెడ్డిపల్లి, లింగాయిపల్లి, రంగారెడ్డిపల్లి గ్రామాల ప్రజలు చిరుత సంచారంతో భయాందోళన చెందుతున్నారు. కొండాపూర్‌ ఆశిరెడ్డిపల్లి మధ్య చిరుత సంచారం కొనసాగుతున్నది. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారులకు అందించిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొండాపూర్‌, రెడ్డిపల్లి సమీపంలో లేగదూడ, మేకను తిన్నప్పుడు సెక్షన్‌ ఆఫీసర్‌ నర్సింహులు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి వచ్చారు. చిరుత అని చెప్పడానికి ఆధారాలు లేవని చెప్పారు. అది హైనానా చిరుత పులి అని చెప్పడానికి కష్టంగా ఉందన్నారు.

భయంతో పరుగెత్తాను..



కొండాపూర్‌ అటవీ ప్రాంతంలో బొందె గుట్ట, గొర్లెల్ల గుట్ట మధ్య మా పొలం ఉంది. అక్కడే పశువులు కూడ కట్టేస్తాం. ఎప్పటిలాగే పొలం వద్దకు పడుకోడానికి వెళ్లాను. కొద్దిసేపు మంట పెట్టుకుని పశువులకు మేత వేయడానికి వెళ్లాను. కుక్క అరుస్తూ వచ్చి కంటపడింది. వెంటనే లైట్‌ వేసి చూడగా చిరుత కొద్ది దూరంలో నిలబడి ఉంది. భయంతో హడలిపోయాను. వెంటనే పరుగెత్తి పక్క పొలంలో ఉన్న వారి వద్దకు వెళ్లాను. తర్వాత ఇంటికి వచ్చి పడుకున్నాం. పొలానికి వెళ్లాలంటేనే భయంగా ఉంది.

– రెడ్డిపల్లి అంజిలయ్య, కొండాపూర్‌

ఆనవాళ్లు చిక్కడం లేదు..



కొండాపూర్‌, ఆశిరెడ్డిపల్లి, రెడ్డిపల్లి ప్రాంతాల్లో చిరుత సంచరిస్తుందని సమాచారం వచ్చింది. తమ సిబ్బంది వెళ్లి పరిశీలించారు. చిరుత అనడానికి సరైన ఆధారాలు దొరకడం లేదు. హైనా కూడ చిరుతలాగే కనిపిస్తుంది. అదే ఉండవచ్చని మా అనుమానం. రైతులు చూసినట్లు చెపుతున్నా తమకు స్పష్టత రావాలి. ఒకవేళ చిరుత ఉంటే బోను ఏర్పాటు చేస్తాం. రైతులు పశువులను బయట కట్టేయకూడదు. ఒంటరిగా వెళ్లకపోవడం మచింది. చేతిలో ఎపుడు కర్ర పట్టుకుని పొలానికి వెళ్లాలి.

– మక్బూల్‌ హుస్సేని, రేంజ్‌ ఆఫీసర్‌, మహమ్మదాబాద్‌

బాలింత మృతిపై ఆందోళన



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టిన కుటుంబ సభ్యులు

వైద్యుల నిర్లక్ష్యంమంటూ ఆరోపణ

గద్వాల క్రైం: పురిటినొప్పులు రావడంతో ప్రసవం కోసం కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు శస్త్ర చికిత్స చేయడంతో బిడ్డకు జన్మనిచింది. బాలింత పరిస్థితి విషమంగా ఉందంటూ మెరుగైన చికిత్స కోసం మరో ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బాలింత మృతి చెందింది. ఈమె మృతికి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టిన ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా.. గద్వాల మండలం కొండపల్లికి చెందిన కుర్వ శివలీలా(19)ను కుర్వపల్లికి చెందిన కుర్వ రాజుకు ఏడాదికిత్రం ఇచ్చి వివాహం జరిపించారు. ఈ నెల 5వ తేదీన పురిటి నొప్పులు రావడంతో మొదటి ప్రసవం కోసం కుటుంబ సభ్యులు పట్టణంలోని శ్రీరాఘవేంద్ర ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు శస్త్ర చికిత్స చేయగా బిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో బాలింత ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌లోని మరో ప్రైవేట్‌ ఆస్పత్రికి ఆదివారం ఉదయం పరిస్థితి విషమించి బాలింత మృతి చెందింది. దీంతో కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పట్టణంలోని శ్రీరాఘవేంద్ర ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. వైద్యులు చేసిన తప్పిదం కారణంగానే శివలీలా మృతి చెందిందన్నారు. వైద్యం కోసం ఇప్పటికే రూ.లక్షలు ఫీజుల రూపంలో చెల్లించామన్నారు. ఈ విషయంపై వైద్యుడు రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రసవం కోసం వచ్చిన క్రమంలో గర్భిణీ ప్రసవ తేదీకి ఇంకా 20 రోజుల సమయం ఉండడం, రక్తం తక్కువగా ఉందన్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని వారి కుటుంబ సభ్యులకు తెలియజేశామన్నారు. వైద్యుల తప్పిందమేమి లేదన్నారు.

రూ. 8లక్షల ఒప్పందం?

ఈ విషయంలో కొందరు పెద్దలు జోక్యం చేసుకుని బాధిత కుటుంబసభ్యులకు నష్ట పరిహారం కింద రూ.20లక్షలు చెల్లించాల్సిందిగా డిమాండ్‌ చేశారు. మా తప్పేమి లేదని, నష్ట పరిహారం ఇవ్వలేమని ఆస్పత్రి యాజమాన్యం తెగేసి చెప్పారు. ఆస్పత్రిలో అయిన ఖర్చు రూ. 4లక్షల ఫీజు తిరిగి బాధిత కుటుంబసభ్యులకు అందజేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. నెల క్రితం ఇదే ఆస్పత్రిలో నవజాత శిశువు సైతం మృతి చెందగా, కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఆ కుటుంబ సభ్యులకు సైతం నష్టపరిహారం అందించారనే విమర్శలు వచ్చాయి. తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడంతో రోగులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యువ జంట బలవన్మరణం

- ఏడాది క్రితమే ప్రేమ వివాహం
- ఇరు కుటుంబ సభ్యుల విమర్శలతో మనస్తాపం
- నాగర్‌కర్నూల్‌ జిల్లా జిన్‌కుంటలో విషాదం



భానుమతి, మహేష్‌ (ఫైల్‌)

బల్మూర్‌: ప్రేమించి పెళ్లి చేసుకున్న యువ దంపతులు ఇరు కుటుంబాలకు చెందిన వారి విమర్శలను తట్టుకోలేక మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ విషాదకర సంఘటన నాగర్‌కర్నూల్‌ జిల్లా బల్మూర్‌ మండలంలోని జిన్‌కుంటలో చోటుచేసుకుంది. అచ్చంపేట సీఐ రవీందర్‌, గ్రామస్తుల కథనం ప్రకారం.. జిన్‌కుంట గ్రామానికి చెందిన మహేష్‌(21), భానుమతి(19) కొంతకాలంగా ప్రేమించుకొని పెళ్లికి సిద్ధపడగా ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు నిరాకరించారు. దీంతో వారు పెద్దలను ఎదిరించి ఏడాది క్రితం పెళ్లి చేసుకున్నారు. అయితే అప్పట్లో భానుమతి మైనర్‌ కావడంతో ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మహేష్‌పై కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. భానుమతి మేజర్‌ అయిన తర్వాత మహేష్‌ జైలు నుంచి తిరిగి వచ్చి.. ఇద్దరు భార్యాభర్తలుగా గ్రామంలోనే జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి మహేష్‌, భానుమతి గ్రామ సమీపంలోని మహేష్‌కు చెందిన వ్యవసాయ పొలం వద్ద వేప చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ రవీందర్‌, ఏఎస్‌ఐ రేణయ్య ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. భానుమతి తల్లి పోలే ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. మృతదేహాలను అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి సాయంత్రం స్వగ్రామానికి తెచ్చారు. ప్రేమించుకొని పెళ్లి చేసుకున్న ప్రేమికులను నిత్యం ఇరు కుటుంబాలకు చెందిన వారు వివక్ష పూరితంగా దూషించడం, విమర్శలు చేయడంతోనే వారు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. ఆత్మహత్యకు పాల్పడిన ప్రేమజంట మృతదేహాలను గ్రామానికి తరలించి అంత్యక్రియలు జరుపుతుంటడంతో ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలో పోలీస్‌ పికెట్‌ ఏర్పాటు చేశారు.

సాగులో విత్తనాల ఎంపిక కీలకం

- కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దు
- గుర్తింపు పొందిన కంపెనీ విత్తనాలు మేలు
- నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి
- వ్యవసాయాధికారుల సూచనలు



మహబూబ్‌నగర్‌ రూరల్‌ మండలం మాచన్‌పల్లిలో ట్రాక్టర్‌ సాయంతో జొన్న విత్తనాలు విత్తుతున్న దృశ్యం

పాడి–పంట

అధికారి సలహా: బి.వెంకటేష్‌, ఏడీఏ, మహబూబ్‌నగర్‌

మహబూబ్‌నగర్‌ (వ్యవసాయం): వానాకాలం సీజన్‌లో రైతులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే సమయం ఆసన్నమైంది. ఈ సమయంలో పలు రకాల కంపెనీల విత్తనాలు, పురుగుల మందుల ప్రచారం జోరుగా సాగిత్తోంది. ఈ సమయంలో రైతులు మోసపోకుండా నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.వెంకటేష్‌ రైతులకు వివరించారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్‌ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటంతో రైతులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. వానాకాలం సీజన్‌ ప్రారంభం మొదలైందంటే నకిలీ, నాసిరకం విత్తనాలు మార్కెట్‌కు వస్తుంటాయి. రైతులు ఆ కంపెనీల వలలో పడి విత్తనాలు కొని మోసపోవడం మామూలైంది. జిల్లాలో ఆరుతడి పంటల సాగులో పత్తి ఎక్కువ విస్తీర్ణం ఉంటుంది.

నేల స్వభావాన్ని బట్టి ఎరువుల వాడకం

నేల స్వభావాన్ని బట్టి పైరు ఎదుగుదల, చీడపీడల ఉధృతి ఉంటుంది. కాబట్టి భూమి పోషక విలువలను బట్టి ఎరువులు, పురుగు మందులు వేయడం ఉత్తమం. ఒకరిని చూసి మరొకరు ఒకే రకం పంటలు, విత్తనాలు వేయడం ఎరువులు, పురుగుల మందులు వేయకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాల మేరకు ఎరువుల మందులు వేసుకుంటే మంచిదని పేర్కొంటున్నారు.

పురుగుల మందుల ఎంపిక

- పంటల చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఏదో రకం మందులు పిచికారీ చేస్తుంటారు. అలా కాకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచన మేరకు పురుగు మందులు కొనాలి
- పురుగు మందులు రెండు మూడింటిని కలిపి వాడకూడదు
- కొనుగోలు సమయంలో డీలరు రికార్డుల్లో రైతు సంతకం చేయాలి.

వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలి

రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. దళారులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. గ్రామాల్లోకి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి విత్తనాలు అమ్మితే కొనవద్దు. అలాంటి వారిపై వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలి.

– బి.వెంకటేష్‌, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం

- వ్యవసాయశాఖ ద్వారా లైసెన్స్‌ పొందిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం ఉత్తమం
- విత్తనం కొనుగోలు బిల్లుపై నంబరు, విత్తనం రకం, కొనుగోలు తేదీ, డీలర్ల సంతకం, రైతు సంతకం, కొనుగోలు బిల్లుపై ఉండేలా చూసుకోవాలి
- గడువు దాటిన విత్తనాలు, వదులుగా ఉన్న ప్యాకెట్లు, చిరిగిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి ప్యాకెట్లు కొనుగోలు చేయవద్దు
- బిల్లులపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్ను నంబర్లు, విక్రయం దారుని పేరు, విక్రయదారుడి సంతకం, తేదీ, రకం పేరు, బ్యాచ్‌ నంబర్‌, గడువు తేదీ, నికర ధర, కంపెనీ పేరు తప్పని సరిగా నమోదు చేయాలి
- విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలు తీసుకొని వాటిలో పేర్కొన్న అంశాలను క్షుణ్ణంగా చదవాలి
- కొనుగోలు చేసిన సరుకును డీలరు వద్ద తూకం వేయించాలి
- మొలకెత్తే దశ, పూత దశతో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారి లేదా శాస్త్రవేత్తలను సంప్రదించాలి
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి
- విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే మొలక శాతాన్ని చూసుకోవాలి. మొలక శాతం సంతృప్తిగా ఉన్న వాటిని విత్తనాలుగా వాడాలి

క్లుప్తంగా...

ములుగు జిల్లాలో నాలుగు మందుపాతరల గుర్తింపు

- అప్పటికే పేలిపోయిన 3 ఐఈడీలు
- జంతు కళేబరాలు లభ్యం


పోలీసులు గుర్తించిన మందు పాతర

వెంకటాపురం.కె (ములుగు): తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరభద్రవరం అటవీ ప్రాంతంలో పోలీసులు నాలుగు మందు పాతర (ఐఈడీ)లను గుర్తించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ శబరీష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో కొద్ది రోజులుగా పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బృందాలు మావోయిస్టులు అమర్చిన మందు పాతరలను గుర్తించడానికి తనిఖీలు చేస్తుండగా ఈ నాలుగు మందుపాతరలను గుర్తించినట్లు వెల్లడించారు. వాటిలో మూడు పేలిపోయి ఉన్నాయని, సమీపంలో ముళ్లపంది, కొండెంగ, ఒక పెంపుడు కుక్క కళేబరాలను గుర్తించామని, మిగిలిన మందుపాతరను బాంబ్‌స్క్వాడ్ సహాయంతో నిర్వీర్యం చేసినట్లు తెలిపారు.

ఏటీఆర్, ఎన్‌ఎస్‌టీఆర్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు

ఏపీ,తెలంగాణ సంయుక్త సమావేశంలో వివిధ అంశాలపై చర్చ

సాక్షి, హైదరాబాద్: ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్), నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ (ఎన్‌ఎస్‌టీఆర్)లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాన్ని కఠినతరంగా అమలు చేస్తామని తెలంగాణ పీసీసీఎఫ్ డోబ్రియాల్, ఆంధ్రప్రదేశ్ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి తెలిపారు. ఏ సమస్య తలెత్తినా రెండు రాష్ట్రాలు సుహృద్భావ వాతావరణంలో చర్చించి నిర్ణయాలు తీసుకుని ముందుకుపోవాలని నిర్ణయించామన్నారు. ఆమ్రాబాద్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో రెండు రాష్ట్రాల అధికారులు పాల్గొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుతో పాటు అడవులకు సంబంధించిన సరిహద్దు సమస్యలు, నివాస నిర్వహణ, రక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ ప్రాంతంలో తీర్థయాత్రల సందర్భంగా భక్తుల తాకిడి పెరుగుతుండటంతో ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉందని అధికారులు తెలిపారు. రెండు టైగర్ రిజర్వ్‌లలో ప్రత్యేకంగా తాగు నీటి కోసం ప్రత్యామ్నాయాన్ని అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఏపీ చీఫ్ వైల్డ్ వార్డెన్ ఏకే నాయక్, ఏటీఆర్, ఎన్‌ఎస్‌టీఆర్ అధికారులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో హైటెక్స్‌లో వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనం

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- హాజరుకానున్న దేశవిదేశాల వెడ్డింగ్ ప్లానర్లు, డిజైనర్లు



సనత్‌నగర్ (హైదరాబాద్): జాతీయ, అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ టూరిజం, తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ 3వ ఎడిషన్, 3వ టీసీఈఐ ఎస్ఐడబ్ల్యూయూపీసీ గ్లోబల్ 2024 బియాండ్ ఇమాజినేషన్, 7వ టీసీఈఐ ఈవెంట్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024 వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు ఆదివారం బేగంపేట పర్యాటక భవన్‌లోని ది ప్లాజా హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ, భారతీయ వివాహ పరిశ్రమలోని నిపుణులను ఇది ఒకచోట చేర్చుతుందని, ఈ ఈవెంట్ ద్వారా వివాహాలకు దక్షిణాది నుంచి ముఖ్యమైన సహకారం, పరిజ్ఞానం, ప్రత్యేక వేదికను అందించడమే లక్ష్యమన్నారు. భారతీయ వివాహ వ్యవస్థలోని వివిధ అంశాలపై జ్ఞానయుక్తమైన సెషన్లు ఉంటాయని, జాతీయ, అంతర్జాతీయ వక్తలు ఈ సమావేశానికి హాజరుకానున్నారని తెలిపారు. ఈ కన్వెన్షన్ కోసం దేశవిదేశాల్లో ఉన్న 20కి పైగా వెడ్డింగ్ ప్లానర్లు, వెడ్డింగ్ డిజైనర్లు, వెడ్డింగ్ స్టైలిస్టులు, డెకరేటర్లు, ఈవెంట్ మేనేజర్లు, ఈవెంట్ ఇండస్ట్రీలోని ఇతర క్రాఫ్ట్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయన్నారు. ఈవెంట్‌కు సిడ్నీ నుంచి వెండీ ఈఎల్ ఖౌరీ సహా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిపుణులు హాజరవుతారన్నారు. టెడ్డీ ఇమాన్యుయేల్ (ఫిలిప్పీన్స్), మైఖేల్ రూయిజ్ (ఫిలిప్పీన్స్), బ్రయాన్ టాచీ-మెన్సస్ (ఘనా) తదితరులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం దేశవిదేశాల నుంచి 700 మందికి పైగా ప్రతినిధులకు స్వాగతం పలుకుతోందన్నారు. 'ఈవెంట్ బజార్'గా పిలవబడే ఎక్స్‌పోలో 60కి పైగా స్టాల్స్‌లో గ్రాండ్ డిస్‌ప్లే ఉంటుందన్నారు. ఈవెంట్ పరిశ్రమలో ఉన్న విభిన్న ఉత్పత్తులు, సేవలు, అత్యాధునిక ట్రెండ్లను ప్రదర్శిస్తుందని చెప్పారు. ప్యానెల్ చర్చలు, వర్క్‌షాప్‌లు, ఈవెంట్ సేఫ్టీ, టెక్నాలజీ పాత్ర తదితర కీలక అంశాలపై సమాంతర సెషన్లు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ డైరెక్టర్ రమేశ్‌నాయుడు, హైటెక్స్ హెడ్ టీజీ శ్రీకాంత్, టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాంబాబు, ప్రధాన కార్యదర్శి రవిబురా, కోశాధికారి ఎండీ తౌఫిక్ ఖాన్, ఎస్ఐడబ్ల్యూయూపీసీ గ్లోబల్ 2024 కన్వీనర్ సాయి శ్రవణ్ మాదిరాజు, టీసీఈఐ ఈవెంట్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024 కన్వీనర్ రామ్ ముప్పన, కో-కన్వీనర్లు హిరీష్‌రెడ్డి, కుమార్‌రాజా, సుధాకర్ యారబడి, డాక్టర్ సౌరభ్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

- 'ఆటా' బిజినెస్ సెమినార్‌లో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన అట్లాంటాలో 'ఆటా' బిజినెస్ సెమినార్‌లో ఆదివారం ప్రసంగించారు. హైదరాబాద్ సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి వికేంద్రీకరణ కోసం కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచానికి ఏఐ రాజధానిగా హైదరాబాద్‌ను రూపొందించే లక్ష్యంతో 200 ఎకరాలను ఏఐ పరిశ్రమల కోసం కేటాయించినట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే గ్లోబల్ ఏఐ సమ్మిట్‌కు అమెరికాలో స్థిరపడ్డ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రావాలని కోరారు.

'సైబర్' బాధితులకు రూ.7.9 కోట్లు అందజేత

- సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును ఇప్పించిన అధికారులు
- జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసులు పరిష్కారం
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల చేతిలో డబ్బు పోగొట్టుకున్న బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు న్యాయం చేస్తున్నారు. ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఒక్క రోజులోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.7.9 కోట్లు తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించారు. బాధితులు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన సందర్భంలో వెంటనే సంబంధిత బ్యాంకు, సైబర్ సెక్యూరిటీ విభాగానికి చేసిన ఫిర్యాదుల ఆధారంగా నేరగాళ్లకు డబ్బులు వెళ్లకుండా ఫ్రీజ్ చేసి న్యాయ ప్రక్రియ ద్వారా అధికారులు బాధితులకు రీఫండ్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అన్ని జిల్లాల పోలీసు విభాగాలు, పోలీసు కమిషనరేట్ల అధికారుల సమన్వయంతో జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైనట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీసీఎస్‌బీలో మొత్తం 4,144 కేసులు నమోదు కాగా, ఇందులో జూన్ 8న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసులలో బాధితులకు రూ.7.9 కోట్లు సొమ్మును తిరిగి ఇప్పించగలిగినట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లోనూ 803 కేసులు పరిష్కరించగలిగినట్టు తెలిపారు. సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శిఖాగోయల్ సూచించారు. అపరిచిత వ్యక్తులు, నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లలోని లింక్‌లపై క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని కోరారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్మును తిరిగి కాపాడేందుకు అవకాశాలు ఎక్కువ ఉంటాయని శిఖాగోయల్ తెలిపారు.

విద్యుత్ స్తంభంపైనే ఆగిన ఊపిరి

- షాక్‌తో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి
- నాలుగు గంటలపాటు స్తంభంపైనే మృతదేహం



ఆదిలాబాద్ రూరల్: ఓ ఇంటికి విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తడంతో మరమ్మతులు చేసేందుకు కరెంట్ స్తంభం ఎక్కిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్.. దానిపైనే షాక్‌కు గురై మృతిచెందాడు. ఆదిలాబాద్ జిల్లా రాములుగూడలో ఈ ఘటన జరిగింది. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని రాములుగూడ గ్రామానికి చెందిన దడంజే మోతీరాం (35) కొన్నేళ్లుగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఓ ఇంటికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మోతీరాంను పిలిచారు. ఆయన వచ్చి సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. అయితే పైనుంచి వెళ్తున్న త్రీఫేజ్ విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కుగురై అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మోతీరాం మృతితో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనాస్థలికి చేరుకుని ఆందోళన చేశారు. తమకు పరిహారం చెల్లించే వరకు మృతదేహాన్ని కిందకు దించొద్దని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు అక్కడికి రావడం ఆలస్యం కావడంతో మోతీరాం మృతదేహం స్తంభంపైనే నాలుగు గంటలపాటు ఉండిపోయింది. పోలీసులు, విద్యుత్ అధికారులు బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మోతీరాం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా మోతీరాం మృతికి.. తమకు ఎలాంటి సంబంధం లేదని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతిరెడ్డి తెలిపారు. విద్యుత్ స్తంభంపైకి ఎక్కిన మోతీరాం తమ లైన్‌మన్, జూనియర్ లైన్‌మన్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు.

హైవేలు రక్తసిక్తం

జాతీయ రహదారులు 44, 65పై ఘోర రోడ్డు ప్రమాదాలు

ఐదుగురు దుర్మరణం.. ఆరుగురికి గాయాలు

ఆదివారం రాష్ట్రంలోని రెండు జాతీయ రహదారులు రక్తసిక్తమయ్యాయి. 44వ నంబర్ హైవేపై జరిగిన ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా, హైవే 65పై చోటుచేసుకున్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. రెండు ఘటనల్లో మొత్తం ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.

పెబ్బేరు రూరల్: వారంతా జైనమత ప్రచార బోధకులు.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కాలినడకన బయల్దేరిన వారిని డీసీఎం రూపంలో మృత్యువు వెంటాడింది. 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో ఓ సాధువుతోపాటు ఇద్దరు సహాయకులు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు స్వామీజీలకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన జైనమత ప్రచార బోధకులు విజ్ఞాన్‌ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహరాజ్, ప్రియాంకర్ మహరాజ్, వీరికి తోడుగా సహాయకులు భగవాన్ బాయ్, హేమల్ ప్రవీణ్ షాతో పాటు మరికొందరు ఈనెల 3న హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కాలినడకన బయల్దేరారు. మార్గమధ్యలో పెబ్బేరు మండలం రంగాపురం పాఠశాలలో శనివారం రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం నడక ప్రారంభించారు. గ్రామ శివారులో స్వామీజీలు వీల్‌చైర్‌లో కూర్చోగా, సహాయకులు తోసుకుంటూ వెళ్తుండగా.. కర్నూలు వైపు వేగంగా వెళ్తున్న డీసీఎం వారిని ఢీకొట్టింది. ప్రమాదంలో భగవాన్ బాయ్ (36), హేమల్ ప్రవీణ్ షా (40)లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. స్వామీజీలు విజ్ఞాన్‌ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహరాజ్, ప్రియాంకర్ మహరాజ్‌లకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హైవే అంబులెన్స్‌లో గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పునీత్ మహరాజ్ (45) మృతిచెందారు. మరో ఇద్దరు స్వామీజీలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

లారీల మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయిన కారు..



సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): జాతీయ రహదారి 65పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ శివారులో ఆదివారం జరిగింది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా దేవరిప్పరిగి తాలూకా ఉన్నాల్ వాసి హాజీ షబాజ్ తన భార్య సమ్రీన్ (45), ఇద్దరు కుమారులు జునైద్, అబ్దుల్లాలతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లి పని చూసుకొని సొంతూరుకు వెళ్తున్నారు. నందికంది శివారు నాగ్సాన్‌పల్లి చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకుంటున్నారు. వారి వెనకాలే హైదరాబాద్ నుంచి సదాశివపేట వైపు అతివేగంగా వస్తున్న ట్యాంకర్ లారీ డ్రైవర్ మృత్యుంజయ దుబే(45) కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. అదే సమయంలో ఇటుగా జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు మరో లారీ వెళ్తోంది. దీంతో కారు.. రెండు లారీల మధ్య ఇరుక్కుని నుజ్జయింది. ఈ ఘటనలో కారులో ఉన్న సమ్రిన్, ట్యాంకర్ డ్రైవర్ మృత్యుంజయ దుబే ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ప్రమాదంలో హాజీ షబాజ్‌కు, అతని ఇద్దరు కుమారులకు, లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. చనిపోయిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలూరులో చోరీ

- బంగారం, నగదు అపహరణ


తెరుచుకొని ఉన్న బీరువా

గట్టు: మండలంలోని ఆలూరులో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారం, నగదు ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన నర్సన్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మన్యంకొండకు దైవ దర్శనానికి వెళ్లారు. శనివారం ఇంటికి చేరుకోగా గేటుకు వేసిన తాళం అలాగే ఉండగా.. ఇంటి తాళంతో పాటు గదిలోని బీరువా తాళం విరగొట్టి ఉన్న విషయాన్ని గుర్తించారు. బీరువాలో దాచిన 6 తులాల బంగారం, రూ.50 వేల నగదు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

కొత్ర గ్రామంలో..


వెల్దండ మండలం కొత్రలో

వెల్దండ: మండలంలోని కొత్రలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని అందుగుల బాలమ్మ ఇంట్లో తులం నర బంగారు, రూ.7,500, 10 తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. అదేవిధంగా బూత్కూరి బాలమ్మ ఇంట్లో బీరువా ధ్వంసం, అలాగే పోలేమోని సురేష్, అందుగుల రామస్వామి ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. చోరీకి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

బదిలీలకు వేళాయె..

- ముగిసిన ఎన్నికల ప్రక్రియ
- త్వరలోనే అధికారులకు స్థాన చలనం
- రెవెన్యూ, పోలీస్ శాఖల్లో మార్పులు
- నేతల చుట్టూ ప్రదక్షిణలు



అచ్చంపేట: అసెంబ్లీ.. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా ముగిశాయి. ఎన్నికలకు ముందు ఒకే డివిజన్‌లో మూడేళ్లకు మించి పనిచేయరాదన్న నిబంధన అనుసరించి అప్పటి అధికారులను బదిలీ చేశారు. పార్లమెంట్ పరిధిలో స్థానికులను ఇతర జిల్లాలకు పంపించారు. జిల్లా ఎల్లలు దాటుకొని వివిధ ప్రాంతాల నుంచి రెవెన్యూ, పోలీస్ అధికారులు జిల్లాకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. దీంతో ఎక్కడివారిని అక్కడికి పంపిస్తారనే భావనతో అధికారులు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు షురూ చేశారు. అయితే పైరవీలు చేసుకున్నవారిని యథాతథంగా కొనసాగిస్తారా..? లేకుంటే బదిలీ చేస్తారా..? అనేది తేలాల్సి ఉంది.

ఇతర జిల్లాల నుంచి..

ప్రధానంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో పనిచేసిన ఆర్డీఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు నారాయణపేట, నల్గొండ, గద్వాల, యాదాద్రి జిల్లాలకు బదిలీపై వెళ్లగా.. సూర్యాపేట, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల నుంచి జిల్లాకు అప్పట్లో నలుగురు తహసీల్దార్లు వచ్చారు. అదేవిధంగా 12 మంది ఎంపీడీఓలు మహబూబ్‌నగర్, వనపర్తి, సిద్దిపేట జిల్లాకు బదిలీపై వెళ్లగా.. వనపర్తి, సిద్దిపేట, సూర్యాపేట, రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి 13మంది ఎంపీడీఓలు జిల్లాకు వచ్చారు. పోలీస్ శాఖల్లో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు సైతం బదిలీ అయ్యారు. ఎక్సైజ్‌శాఖలో సుదీర్ఘకాలంగా పనిచేసిన సీఐ, ఎస్ఐ,. మున్సిపాలిటీల్లో మూడేళ్లకు పైబడి ఒకేచోట పనిచేసిన మున్సిపల్ కమిషనర్లను బదిలీలు చేశారు. పౌరసంబంధాల శాఖ, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎక్సైజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు బదిలీపై వెళ్లారు. వీరంతా తిరిగి ఆయా స్థానాలకు వచ్చేందుకు పైరవీలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

వీరి పరిస్థితి ఏమిటీ..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ శాఖల ఉన్నతాధికారుల బదిలీలు జరగగా..జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఇక్కడే తిష్టవేసిన వారు కదలడం లేదనే చర్చ జరుగుతోంది. అయితే కొందరు అధికారుల పదవీ విరమణ దగ్గరగా ఉండడంతో నిబంధనల ప్రకారం వారిని బదిలీ చేయలేదని తెలిసింది. ఈసారి సుదీర్ఘకాలం పాటు జిల్లాను అంటిపెట్టుకొని ఉన్నవారిని కూడా బదిలీ చేసే అవకాశం ఉందని అధికార వర్గాల్లో చర్చగా మారింది.

స్థానిక ఎన్నికలు వస్తే జాప్యం

ఎన్నికల కమిషన్ నిబంధనల్లో భాగంగా బదిలీ అయిన పోలీసు, రెవెన్యూ అధికారులు ప్రస్తుతం ఎన్నికల విధులు ముగించుకున్నారు. మరో రెండు రోజుల వ్యవధిలో పార్లమెంట్ ఎన్నికల ఈవీఎంల అప్పగింత కార్యక్రమం కూడా ముగియనుంది. రెవెన్యూ యంత్రాంగం సెగ్మెంట్‌ల వారీగా ఎన్నికలకు సంబంధించిన వివరాలు అప్పగించే కసరత్తు సాగుతోంది. ఎన్నికల ఖర్చులు అప్పగింత, బడ్జెట్ మంజూరులో కాస్త ఆలస్యం జరిగి.. ఆలోపు స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ వస్తే మరో ఆరు నెలలు దాకా అధికారులు బదిలీలకు బ్రేక్ పడుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల ఊసు లేకుంటే ఈ నెల10 నుంచే ఉన్నతస్థాయి అధికార యంత్రాంగం నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభమై కిందిస్థాయి వరకు కొనసాగనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వెళ్లేందుకు వెనుకంజ

ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన రెవెన్యూ, పోలీసు అధికారులు కొందరు మంచి పోస్టింగ్‌లో ఉండటంతో ఆయా పోస్టింగ్‌లను వదులుకునేందుకు సిద్ధంగా లేనట్లు సమాచారం. నాగర్‌కర్నూలు, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ వంటి కీలక ప్రాంతాల్లో పోస్టింగ్‌లు పొందిన అధికారులు కొంతమంది ఆయా ప్రాంతాల్లోనే పోస్టింగ్‌లు కొనసాగేందుకు స్థానికంగా కీలక నేతలను ప్రసన్నం చేసుకునే యత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. ఇప్పటికే కొంత మంది అధికారులు అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించినట్లు తెలిసింది. ముఖ్యంగా పోలీసుశాఖలో చాలా మంది అధికారులు జిల్లాలో పోస్టింగ్‌లను వదులుకునేందుకు ఇష్టం పడటం లేదు. ఈక్రమంలో ఎక్కడివారు అక్కడే ఉండేందుకు అవసరమైన పైరవీలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఏడాదికాలం పూర్తి కాకుండానే బదిలీ అయిన అధికారులను తిరిగి అదే పోస్టింగ్‌లకు పంపిస్తారా..? లేదా..? అన్న విషయంలో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఏనిర్ణయం తీసుకుంటారోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

జేఈఈ అడ్వాన్స్‌లో వాగ్దేవి విజయదుంధుబి


అన్విత


శివ


సాయి భరత్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో జిల్లా కేంద్రంలోని వాగ్దేవీ ఐఐటీ అకాడమీ విద్యార్థులు విజయదుంధుబి మోగించారు. అకాడమీ విద్యార్థులు అన్విత ఆల్‌ఇండియా 723వ ర్యాంకు, సాయి భరత్ 1,140 ర్యాంకు, శివ 2,686 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా అకాడమి కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులకు పూర్తి స్థాయిలో సబ్జెక్టుపై పట్టు సాధించే విధంగా ప్రత్యేక బోధన అందిస్తున్నామని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. అందుకు తమ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో సత్తా చాటుతున్నారన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ఇన్‌చార్జి పావని, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజయకేతనం ఎగరవేసిన 'రిషి'



విద్యార్థులను అభినందిస్తున్న అకాడమీ యాజమాన్యం తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో జిల్లా కేంద్రంలోని రిషి అకాడమీ విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారు. కళాశాల విద్యార్థులు యవరాజ్‌నాయక్ ఎస్టీ కేటగిరిలో 805, జోయల్‌కుమార్ ఎస్సీ విభాగంలో 1,251, ఓబీసీ కేటగిరిలో కౌషిక్‌యాదవ్ 4,461, వంశీచంద్ర 8,204, సాకేత్‌సింగ్ 14,741 ర్యాంకులు సాధించారు. కళాశాల కరస్పాండెంట్ చంద్రకళావెంకట్ మాట్లాడుతూ తమ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారని, పోటీ పరీక్షల కోసం అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన చేస్తున్నామని, అందుకు తమ విద్యార్థులు అన్ని విభాగాల్లో సత్తాచాటుతన్నారన్నారు. కార్యక్రమంలో సలహాదారు వెంకటయ్య, డీఎస్ భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన 'ప్రతిభ' విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రతిభ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈమేరకు ఆల్ ఇండియా వివిధ కేటగిరిలో బి.శ్రీకాంత్ 226, రాము 256, శివ 328, శ్రీనిత్య 1,200, చరణ్‌లాల్ 1,747, సునీల్ కుమార్ 2,162, శ్రీనివాస్ 4,112, విష్ణువర్ధన్‌రెడ్డి 4,575, కార్తిక్‌సాగర్ 7,629, గణేష్ 7,876వ ర్యాంకులు సాధించారు. ఈ మేరకు కళాశాల డైరెక్టర్ మంజులాదేవి మాట్లాడుతూ కళాశాల ప్రారంభించిన నాటి నుంచి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ అన్ని సబ్జెక్టుల్లో సమ ప్రాధాన్యత ఇస్తూ, వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వందశాతం ఫలితాలు సాదించిన ఏకైక కళాశాల నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది.

జైన శాసనాన్ని కాపాడుకోవాలి

పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి


వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఉన్న క్రీ.శ., 1125 నాటి జైన శాసనాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన అఖిల భారతీయ ప్రాచీన ఆలయ పునరుద్ధరణ ట్రస్ట్ చైర్మన్ ఆర్‌కే జైన్‌తో కలిసి స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉన్న క్రీ.శ., 1125వ ఏడాది జనవరి 21 నాటి కల్యాణి చాళుక్య చక్రవర్తి మూడో సోమేశ్వరుని కుమారుడు కందూరు యువరాజు మోడై తైలపుడు పరాలిస్తుండగా మూల సంఘానికి చెందిన మేఘచంద్రభట్టారకుడు వేయించిన జైన శాసనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనంలో గంగాపురంలోని పార్శ్వనాథ చైత్య ఆలయ ప్రస్తావన ఉందన్నారు. అదేవిధంగా స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న క్రీ.శ., 1162 నాటి కందూరు చోళ వంశానికి చెందిన రెండో ఉదయన చోళుడు, కోడూరు స్వయంభూ సోమేశ్వరనాథుని నిత్య అర్చనలకు 5గోకర్ణ సింగరూకలను, గంగాపురం నుంచి వచ్చే ఆదాయాన్ని దానం చేసినట్లుగా ఉందన్నారు. వీటిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అఖిల భారతీయ ప్రాచీన ఆలయ పునరుద్ధరణ ట్రస్ట్ చైర్మన్ ఆర్‌కే జైన్ మాట్లాడుతూ ప్రస్తుతం గొల్లత్తగుడి ఇటుక ఆలయమేనని, జైన చైత్యాలమన్నారు. ఆలయాన్ని పునరుద్ధరించి ఇక్కడ ఉన్న శాసనాన్ని అక్కడికి తరలించాలని ప్రభుత్వాన్ని కోరారు. వారి వెంట ప్లీచ్ ఇండియా సంస్థ కో చైర్మన్ ముఖేష్ కుమార్ జైన్, స్థానిక ఆలయ పూజారి, వారసత్వ ప్రేమికుడు అన్షజైన్ ఉన్నారు.

జూరాలకు 3,830 క్యూసెక్కుల వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఆదివారం ఎగువ నుంచి 3,830 క్యూసెక్కుల వచ్చి చేసినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో స్థానికంగా కురుస్తున్న వర్షాలతో వరద స్వల్పంగా పెరిగినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 4.618 టీఎంసీలు ఉందన్నారు. ప్రాజెక్టు నుంచి 149 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

రామన్‌పాడులో..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం నీటిమట్టం స్వలంగా పెరిగినట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 1,013 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు చెప్పారు. జూరాల ఎడమ కాల్వ నుంచి నీటి సరఫరా లేదని.. సమాంతర కాల్వ నుంచి 27 క్యూసెక్కుల వరద కొనసాగుతుందన్నారు. తాగునీటి అవసరాలకు రోజుకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని తెలిపారు.


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం